క్లుప్తంగా

రాష్ట్ర మహిళా విభాగం సహాయ కార్యదర్శిగా అపర్ణాదేవి



కపిలేశ్వరపురం: వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా విభాగం సహాయ కార్యదర్శిగా మండపేట నియోజకవర్గానికి చెందిన చిన్నం అపర్ణాదేవి నియమితులయ్యారు. పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అపర్ణాదేవిని నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం బుధవారం ప్రకటన విడుదల చేసింది. రాయవరం మండలం పసలపూడి గ్రామానికి చెందిన అపర్ణాదేవి గతంలో జెడ్పీటీసీ సభ్యురాలిగా సేవలందించారు.

బాధితులకు పరామర్శ



అద్దంకివారిలంకలో దొరబాబు తల్లి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కపిలేశ్వరపురం: మాతృ వియోగంతో బాధపడుతున్న అద్దంకివారిలంక గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు సిద్ధాంతుల దొరబాబును, పితృ వియోగంతో బాధపడుతున్న మెరిమెల్ల పవన్‌ను బుధవారం ఆ పార్టీ నాయకులు పరామర్శించారు. పార్టీ మండల అధ్యక్షుడు గూటం సత్యనారాయణ, పార్టీ మండల పరిషత్ విప్ పలివెల మధు, ఎంపీటీసీ సభ్యుడు యర్రంశెట్టి నాగేశ్వరరావు, నాయకులు కొండేటి వెంకన్న, మేడిశెట్టి దుర్గారావు, పాలింగి శ్రీనివాస్, పోలిశెట్టి గణేష్, ప్రగడ అర్జునరావు, వంగా నల్ల శ్రీను తదితరులు బాధితులను పరామర్శించి ధైర్యం చెప్పారు.

పాలనలో సిబ్బంది సేవలు కీలకం



వాచ్‌మెన్ సూర్యనారాయణను సత్కరిస్తున్న ఎమ్మెల్యే, చైర్‌పర్సన్

కపిలేశ్వరపురం: పాలనా వ్యవస్థలో సిబ్బంది సేవలు అత్యంత కీలకమని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, మండపేట మున్సిపల్ కౌన్సిల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి, కో ఆప్షన్ సభ్యుడు రెడ్డి రాధాకృష్ణ, కమిషనర్ టీవీ రంగారావు అన్నారు. మున్సిపాలిటీలో 33 సంవత్సరాలు పాటు రిజర్వాయర్ వాచ్‌మెన్‌గా పనిచేసి స్వచ్ఛందంగా ఉద్యోగ విరమణ చేసిన రాబిల్లి సూర్యనారాయణను మున్సిపల్ కార్యాలయంలో బుధవారం ఘనంగా సత్కరించారు. ఆయన సేవలను వక్తలు కొనియాడారు. సూర్యనారాయణకు ప్రావిడెంట్ ఫండ్ చెక్‌ను అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈ శ్రీనివాస్, ఏఈలు డి.పవన్, ఆర్.అనూష లక్ష్మి, ఆర్‌ఓ శాస్త్రి, ఏఏ ఓ.మూర్తి, టీపీఓ రమ్య పాల్గొన్నారు.

హెచ్‌ఎంకు సన్మానం



వెంకటేశ్వరరావును సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

కె.గంగవరం: ప్రముఖ స్వచ్ఛంద సంస్థ యంగ్ మైండ్స్ మొదటి వార్షికోత్సవం సందర్భంగా ఆదర్శ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న కె.గంగవరం ఉన్నత పాఠశాల హెచ్‌ఎం వెంకటేశ్వరరావును సహచర ఉపాధ్యాయులు బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, 15 ఏళ్లుగా నూరు శాతం ఉత్తీర్ణత సాధించడమే కాకుండా 15 మంది విద్యార్థులను ట్రిబుల్ ఐటీకి అర్హత సాధించేందుకు కృషి చేసిన హెచ్‌ఎం వెంకటేశ్వరరావు సేవలను కొనియాడారు. ఇటీవల కాకినాడలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో వెంకటేశ్వరరావు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ సీనియర్ నాయకులు దాసరి శ్రీను, ఉపాధ్యాయులు ప్రేమ్‌కుమార్, జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

వరినాట్లు పూర్తి చేయాలి

కాజులూరు: మండలంలోని గ్రామాల్లో రైతులు త్వరితగతిన తొలకరి వరినాట్లు పూర్తి చేయాలని మండల వ్యవసాయాధికారి వి.అశోక్ అన్నారు. బుధవారం మండలంలోని గొల్లపాలెం, చేదువాడ, పెనుమళ్ల, తనుమళ్ల, అంద్రంగి తదితర గ్రామాల్లో వ్యవసాయాధికారి పర్యటించి రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా అంద్రంగిలో ఆయన మాట్లాడుతూ, గోదావరి తూర్పు డెల్టా కాలువకు ఇరిగేషన్ అధికారులు నెల రోజుల క్రితమే సాగునీరు విడుదల చేశారన్నారు. దానికి తోడు చెదురు మదురుగా వర్షాలు కురుస్తున్నందున ప్రస్తుతం వాతావరణం అనుకూలంగా ఉందన్నారు. రైతులు చొరవ చూపి సాధ్యమైనంత త్వరగా పూర్తిస్థాయిలో వెదచల్లి కలు లేదా వరినాట్లు పూర్తి చేయాలన్నారు.

నో బ్యాగ్ డే అమలు చేయాలి

కపిలేశ్వరపురం (మండపేట): పాఠశాలల్లో నో బ్యాగ్ డే అమలు కావట్లేదని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోన సత్యనారాయణ ఆరోపించారు. పిల్లల మానసిక ఉల్లాసానికి శనివారం బ్యాగ్ లేకుండా పాఠశాలలకు అనుమతించాలన్నారు. నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో నో బ్యాగ్ డే అమలు చేయట్లేదన్నారు. ప్రస్తుత విద్యాసంవత్సరానికి నో బ్యాగ్ డేను అమలు చేయాలని ఫిబ్రవరిలో ప్రభుత్వం ఆదేశాలనిచ్చినా అధికారులు ఖాతరు చేయడం లేదన్నారు.

పరకే.. బంగారమాయె !

- ఎండుగడ్డికి పెరిగిన గిరాకీ
- వేధిస్తున్న పశుగ్రాసం కొరత
- ట్రాక్టర్ గడ్డి రూ.16 వేలు నుంచి రూ.20 వేలు

రామచంద్రపురం రూరల్: పాడి పంటలకు ఆయువు పట్టు పల్లె సీమలు. ఇది గత చరిత్రగా మాత్రమే చెప్పుకునే పరిస్థితి. ప్రస్తుతం పశువుల పోషణకు అవసరమైన మేత కరవై పల్లె సీమల్లో పాడి పరిశ్రమ ఇబ్బందులు ఎదుర్కొంటోంది. వ్యవసాయం యాంత్రికీకరణ పుణ్యమా అని ఎండుగడ్డికి ఎక్కడ లేని కొరత వచ్చింది. దీంతో గడ్డి పరక బంగారంగా మారిపోతోంది. ఎండుగడ్డి ధర రోజు రోజుకు పెరిగిపోతూ పశువుల పెంపకందారులకు చుక్కలు చూపిస్తోంది.

వరి కోతల్లో యంత్రాల వినియోగం పెరగడంతో ఎండుగడ్డి కోసం పాడి రైతులు అవస్థలు పడుతున్నారు. గతంలో వరిని కూలీలు కోసేవారు. కుప్పనూర్పి ఎండుగడ్డిని జాగ్రత్త పరుచుకుని పశువులకు వేసేవారు. కానీ ఇప్పుడు యంత్రాల ద్వారా పంట కోయడంతో అది పశువులకు పనికి రాకుండా పోతుంది. దీంతో అక్కడక్కడా దొరికే ఎండుగడ్డిని పాడి రైతులు అధిక ధరలకు కొనుగోలు చేస్తున్నారు.



ఎండుగడ్డిని తింటున్న పశువులు

మరింత ఎక్కువైన సమస్య

ఒకప్పుడు రైతులు ఎండుగడ్డిని కారు చౌకగా పాడి రైతులకు ఇచ్చేవారు. దీనికి తోడు ఇటీవల కురిసిన వర్షాలతో కొద్ది మాత్రం ఎండుగడ్డి కూడా తడిచిపోయి పాడైపోవడంతో సమస్య మరింత ఎక్కువైంది. దీంతో ప్రస్తుతం ఎకరా పొలంలో వచ్చే ఎండుగడ్డి రూ.8 వేల నుంచి రూ.10 వేలకు కొనుగోలు చేయాల్సి వస్తోంది. ట్రాక్టరుకు రెండు ఎకరాల్లో గడ్డి లోడు చేస్తే రూ.16 వేల నుంచి రూ.20 వేలకు పాడి రైతులు కొనుగోలు చేయాల్సి వస్తోందని వాపోతున్నారు.

రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల్లో పాడి పశువులు

మండలం	ఆవులు	గేదెలు
రామచంద్రపురం	2,159	7,288
కె.గంగవరం	4,289	8,846
కాజులూరు	4,830	8,332
మండపేట	5,842	7,560
రాయవరం	3,980	5,230
కపిలేశ్వరపురం	3,510	4,870

ఎండు గడ్డి దొరకడం లేదు



ప్రస్తుతం ఎండుగడ్డి చాలా గిరాకీగా ఉంది. గడ్డిని వరిచేను వద్ద కొనుగోలు చేస్తే ఎకరాకు రూ.8 వేల నుంచి రూ.10వేలు అవుతుంది. దీనికి తోడు రవాణా ఖర్చులతో కలుపుకుంటే మరో రూ.రెండు మూడు వేలు అదనంగా అవుతుంది. దీంతో పశుపోషణ భారమవుతోంది.

-మేడిశెట్టి నాగరాజు, పాడి రైతు, వెల్ల.

భవిష్యత్తులో మరింత గిరాకీ



ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే భవిష్యత్తులో ఎండుగడ్డికి మరింత కొరత ఏర్పడేలా ఉంది. అందుకే ధర ఎక్కువైనా ఇప్పుడే ఎండుగడ్డిని కొనుక్కొని నిలువ చేసుకుంటున్నాం. ఎండుగడ్డి ధర పెరగడంతో పాడి పరిశ్రమ చేయాలా? వద్దా? అనేలా ఇబ్బందులు కలుగుతున్నాయి.

-నులుకుర్తి నాని, పాడిరైతు, అన్నాయిపేట, రామచంద్రపురం మండలం.

వెన్నశాతం పెరుగుతుంది

పశువులకు పచ్చగడ్డితో పాటు ఎండుగడ్డి మేత చాలా అవసరం. ఎండుగడ్డితో పాలలో వెన్నశాతం పెరుగుతుంది. చూడి పశువులకు రోజుకు 5 కేజీలకు మించి ఎండుగడ్డి పెట్టకూడదు. పాలిచ్చే పశువులకు మాత్రం రోజుకు 10 నుంచి 15 కేజీల ఎండుగడ్డి పెట్టవచ్చు. పచ్చిమేత 60 శాతం పెడితే, ఎండుగడ్డి 40 శాతం అందించాల్సి ఉంటుంది. వరి చేలు యంత్రాలతో కోసినా మిగిలిన గడ్డిని చుట్టి మోపులుగా చేసే యంత్రాలు అందుబాటులోకి వచ్చాయి. రైతులు వాటిని సద్వినియోగం చేసుకోవాలి.

- మేడిశెట్టి అర్జున్, పశు వైద్యాధికారి, రామచంద్రపురం మండలం.

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి



కాజులూరు: ఆన్‌లైన్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గొల్లపాలెం ఎస్సై మోహన్‌కుమార్ అన్నారు. బుధవారం పోలీస్‌స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ, ఇటీవల నిరుద్యోగులను టార్గెట్‌గా చేసుకొని కొందరు ఆన్‌లైన్ ద్వారా మోసాలకు పాల్పడుతున్నారన్నారు. కొన్ని యాప్‌ల ద్వారా ఇంటి వద్దనే ఉంటూ డబ్బు సంపాదించుకోవచ్చని, బ్యాంక్ ఖాతాలకే నేరుగా ఆదాయం సొమ్ము జమవుతుందని యువతను ఆకట్టుకుంటున్నారన్నారు. మొదట్లో వారే కొంత డబ్బు ఇచ్చి ఆపై పెద్ద మొత్తంలో డబ్బు రావాలంటే కొంత పెట్టుబడి పెట్టాలని యువత నుంచి భారీగా సొమ్ములు వసూలు చేసి యాప్ క్లోజ్ చేస్తున్నారన్నారు. ఇలాంటి మోసాలకు గురికాకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలి

కాజులూరు: గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యల్లో భాగంగా వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని వైఎస్సార్ సీపీ మండల యువజన విభాగ అధ్యక్షుడు పెంకే వెంకటరమణ, పార్టీ మండల శాఖ కార్యదర్శి యాళ్ల సత్తిబాబు తదితరులు కోరారు. బుధవారం కాజులూరులో వారు మాట్లాడుతూ, వర్షాల కారణంగా గ్రామంలో అపారిశుధ్యం తలెత్తి అంటువ్యాధులు ప్రబలే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. గతంలో వర్షాలు సమీపించిన వెంటనే గ్రామంలో అపారిశుధ్యం తలెత్తి పలువురు డెంగీ, విషజ్వరాల బారిన పడ్డారన్నారు. ఉన్నతాధికారులు స్పందించి గ్రామంలో పారిశుధ్యం మెరుగుపరచి, వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలన్నారు. ప్రజల్లో చైతన్య పరచేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు.

పార్టీ బలోపేతానికి కృషి చేస్తాం

కపిలేశ్వరపురం (మండపేట): నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేస్తామని ఆ పార్టీ జిల్లా స్థాయి బాధ్యతలు చేపట్టిన నేతలు అన్నారు. పార్టీ జిల్లా మున్సిపల్ విభాగం అధ్యక్షుడిగా మండపేట పట్టణం 30వ వార్డు కౌన్సిలర్ మారిశెట్టి సత్యనారాయణ, పార్టీ జిల్లా లీగల్‌సెల్ అధ్యక్షుడిగా ఈతకోట గ్రామానికి చెందిన ఏడిదలో నివాసముంటున్న న్యాయవాది టపా గోవిందరావు నియమితులయ్యారు. తమకు అవకాశాలు కల్పించిన ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులుకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ జిల్లా అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి పర్యవేక్షణలో తమకు కేటాయించిన విభాగాల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.



ఎం.సత్యనారాయణ



టి.గోవిందరావు

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సత్కారం

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట మండలం ద్వారపూడిలోని చేకూరి కాశీ విశ్వనాథరాజు జెడ్పీ ఉన్నత పాఠశాలలో దీర్ఘకాలం పాటు పనిచేసి బదిలీపై ఇతర ప్రాంతాలకు వెళ్లిన ఉపాధ్యాయులను బుధవారం పాఠశాల ఆవరణలో ఘనంగా సత్కరించారు. పాఠశాల హెచ్‌ఎం సవితాల సుబ్రహ్మణ్యం, విద్యా కమిటీ చైర్మన్ అనమాల జయ రవీంద్ర యాదవ్ పర్యవేక్షణలో బదిలీ ఉపాధ్యాయులను సన్మానించారు. బదిలీపై వెళ్లిన భౌతికశాస్త్ర ఉపాధ్యాయులు గండి స్వామి ప్రసాద్, పెనుగొ నాగమణి, గణిత ఉపాధ్యాయులు తూలూరి నరేంద్ర, హిందీ ఉపాధ్యాయిని గుండ్రాశి దుర్గాభవాని, ఆంగ్ల ఉపాధ్యాయిని కస్నూరి కళ్యాణి, తెలుగు ఉపాధ్యాయిని ద్వారంపూడి స్రవంతి, వ్యాయామ ఉపాధ్యాయుడిగా పదోన్నతి పొందిన పుచ్చల గౌరీశంకర్‌లను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల కమిటీ నాయకుడు పల్ల వీరబాబు, ఉపాధ్యాయులు గుణ్ణం శివ భాస్కర్, బండారు రాము, గొర్తి వెంకట రామ సుబ్రహ్మణ్య శర్మ ,పలివెల రుద్ర, బి.శాంతకుమారి, మండల యూటీఎఫ్ అధ్యక్షుడు దంగేటి శ్రీనివాసరావు పాల్గొన్నారు



ద్వారపూడి జెడ్పీ ఉన్నత పాఠశాలలో సత్కారం పొందిన ఉపాధ్యాయులు

పేలిన గ్యాస్ సిలిండర్

రామచంద్రపురం రూరల్: మండలంలోని భీమక్రోసుపాలెంలో మంగళవారం రాత్రి గ్యాస్ సిలిండర్ పేలింది. సర్పంచ్ పలివెల లోవరాజు, స్థానికులు, ఫైర్ ఇన్‌స్పెక్టర్ కర్రి వెంకటరెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామంలోని అనిశెట్టి సుబ్బలక్ష్మి ఇంటిలో మంగళవారం రాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇంటి వెనుక నిర్మించిన స్టోర్ రూంలో అగ్ని ప్రమాదం జరిగింది. ఆ గదిలో కట్టెలు తదితర సామాగ్రితో పాటు, గ్యాస్ సిలిండర్ కూడా ఉండటంతో మంటలు చెలరేగి ఆ వేడికి సిలిండర్ పేలిపోయింది. దీంతో స్టోర్ రూం కూలిపోయింది. సిలిండర్ పేలుడుకి ఇంటి పక్కన ఉన్న పితాని చినబాబు వారికి సాయం చేద్దామని వెళ్లి గాయపడ్డాడు. అతడిని రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించగా.. మెరుగైన చికిత్స కోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు.



పేలుడు దాటికి చిన్నాభిన్నమైన స్టోర్ రూం



గ్యాస్ సిలిండర్ అవశేషాలు

మోసం.. చంద్రబాబు నైజం

నియోజకవర్గ కో–ఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాష్

కె.గంగవరం: ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక ప్రజలను మోసం చేయడం చంద్రబాబు నైజమని జిల్లా వైఎస్సార్ సీపీ యువజన విభాగ అధ్యక్షుడు, నియోజకవర్గ కో–ఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాష్ అన్నారు. మండల పరిధిలోని అముజూరులో బుధవారం బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చంద్రబాబు అధికారంలోకి వచ్చిన ప్రతిసారీ సంక్షేమ పథకాలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేయడం పరిపాటిగా మారిందన్నారు. గ్రామంలో ప్రతి ఇంటికీ వెళ్లి చంద్రబాబు ఇచ్చిన మ్యానిఫెస్టోను వివరించి ఆయన మోసాలను ప్రజలకు వివరించారు. అధికారంలోకి వచ్చి 14 నెలలు పూర్తయినా పథకాలు అమలుకు నోచుకోలేదని విమర్శించారు. దీపం పథకం ద్వారా ఏడాదికి మూడు సిలిండర్లు ఇస్తామని చెప్పి నేటికీ ఒకటి మాత్రమే ఇచ్చారని ఎద్దేవా చేశారు. రైతులకు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా ఏడాదికి రూ.20 వేలు అందిస్తామని చెప్పి ఇప్పటికి ఒక్క రూపాయి కూడా అందించలేదన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు నెలకి రూ.1500 ఇస్తామని ప్రకటించారని, కానీ ఇప్పుడు పథకం అమలు చేయాలంటే రాష్ట్రాన్ని అమ్మేయాలని ప్రకటనలు చేయడం దారుణమన్నారు. ప్రజలు కూటమి మోసాలను గమనించి రానున్న రోజుల్లో తగిన బుద్ధి చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పెట్టా శ్రీనివాస్, బీసీ నాయకుడు పంపన సుబ్బారావు, సర్పంచ్ నానాపరపు కళ్యాణి శ్రీనివాస్, పంపన సత్యానందం, గ్రామ పార్టీ నాయకులు మేడిశెట్టి శ్రీనివాస్, పెంకే రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.



కూటమి మోసాలను ప్రజలకు తెలియజేస్తున్న సూర్యప్రకాష్

కీచక కరస్పాండెంట్‌పై చర్యలు తీసుకోవాలి

రాయవరం: మాచవరంలో మైనర్ బాలికపై లైంగిక దాడి చేసిన మార్గదర్శి పాఠశాల కీచక కరస్పాండెంట్ జయరాజుపై కఠిన చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్ధు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన మార్గదర్శి పాఠశాల వద్ద విలేకరులతో మాట్లాడారు. మాచవరంలో జరిగిన ఘటన పట్ల పీడీఎస్‌యూ విద్యార్థి సంఘం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నట్టు తెలిపారు. పాఠశాల కరస్పాండెంట్‌గా బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న వ్యక్తి పాఠశాలలో చదువుతున్న 15 ఏళ్ల బాలికపై అత్యాచారం చేయడం దారుణమన్నారు. ఆ పాఠశాల గుర్తింపును రద్దు చేయాలన్నారు. ఇంత కాలం గుర్తింపు లేకుండా పాఠశాలను నడుపుతుంటే మండల విద్యాశాఖ అధికారులు ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. రాష్ట్రంలో విద్యార్థినులు, మహిళలకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం బాలిక కుటుంబాన్ని ఆదుకోవాలన్నారు. విద్యార్థినులపై లైంగిక వేధింపులు అరికట్టాలని, లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా పోరాటాలు చేస్తామని కూటమి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. బాధిత బాలికలకు మెరుగైన వైద్యం అందించాలని, భద్రత కల్పించాలని, బాధిత కుటుంబానికి రూ.15 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. తొలుత బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో చింతా రాజారెడ్డి, కె.నవీన్, గుణ్ణం వీరబాబు తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి సిద్ధు

ట్రాక్టర్ బోల్తా

అయినవిల్లి: మండలంలోని వీరవల్లిపాలెంలో బుధవారం కొబ్బరిలోడుతో ప్రయాణిస్తున్న ట్రాక్టర్ బోల్తా పడింది. ట్రాక్టర్ బోల్తా కొట్టిన సమయంలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ట్రాక్టర్ డ్రైవర్ స్వల్పగాయలతో బయటపడ్డారు. స్థానికులు వెంటనే స్పందించి ట్రాక్టర్‌లో ఉన్న కొబ్బరికాయలను తీసి ట్రాక్టర్‌ను యథాస్థితికి తీసుకొచ్చారు.

డ్రైన్ పనుల పరిశీలన



మండపేటలో డ్రైన్ పనులను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ దుర్గారాణి

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట 25వ వార్డులోని కరాచీ స్వీట్స్ షాపు ఎదురుగా చేపట్టిన సీసీ డ్రైన్, కవర్ శ్లాబ్ నిర్మాణ పనులను బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి పరిశీలించారు. పనుల తీరుపై కమిషనర్ టీవీ రంగారావుతో చర్చించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ మున్సిపల్ సాధారణ నిధులు రూ.17 లక్షలతో పట్టణంలో కల్వర్టులు, డ్రైన్లకు మరమ్మతులు చేయిస్తున్నామన్నారు. 16వ వార్డులో బీపీఎస్ గ్రాంట్‌తో నిర్మిస్తున్న సీసీ రహదారి నిర్మాణ పనులను పరిశీలించారు. వారి వెంట ముక్కా సుబ్రహ్మణ్యం, జొన్నపల్లి సత్తిబాబు, ముక్కా దాలియ్య, డీఈ కె.శ్రీనివాసు, ఏఈ డి.పవన్ ఉన్నారు.

టీచర్లకు వాటిని రద్దు చేయాలి



నరసాపురపుపేటలో నినాదాలు చేస్తున్న టీచర్లు

రామచంద్రపురం రూరల్: ప్రభుత్వం ఉపాధ్యాయులకు అప్పగిస్తున్న బోధనేతర పనులను రద్దు చేయని పక్షంలో యూటీఎఫ్ తరపున ఉద్యమం చేపడతామని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పి.సురేంద్ర, ఆడిట్ కమిటీ సభ్యుడు పాకలపాటి శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి ప్రదీప్‌కుమార్ హెచ్చరించారు. మండలంలోని నరసాపురపుపేట జెడ్పీ హైస్కూల్‌లో యూటీఎఫ్ రూరల్ శాఖ విస్తృత సభ్యత్వ క్యాంపెయిన్‌ను బుధవారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ, పాఠశాలల్లో యాప్‌లు, పీ–4, విద్యా శక్తి తదితర కార్యక్రమాలు నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. బోధనేతర పనులు ఉపాధ్యాయులకు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. బదిలీ అయిన ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న 2 నెలల జీతం వెంటనే విడుదల చేయాలని, డీఎస్సీ 2008 ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆగస్టు 2న జరగనున్న ఫ్యాప్టో ధర్నాకు అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు హాజరుకావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు డబ్ల్యూవీఎస్ బాపూజీ, ప్రధాన కార్యదర్శి వాడ్రేవు శ్రీనివాస్, బి.లక్ష్మణరావు, ఎం.రామకృష్ణ, సీహెచ్ శ్రీనివాస్, పి.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

‘తూర్పు’లో విలీనానికి తీర్మానం

- పట్టణ సమస్యలపై గళమెత్తిన కౌన్సిల్ సభ్యులు
- అజెండాలో 14 అంశాలకు ఆమోదం
- వాడీవేడిగా కౌన్సిల్ సమావేశం

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట పట్టణాన్ని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా నుంచి రాజమహేంద్రవరం కేంద్రంగా ఉన్న తూర్పు గోదావరి జిల్లాలోకి విలీనం చేసేందుకు సానుకూలమంటూ మున్సిపల్ కౌన్సిల్ తీర్మానం చేసింది. స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో బుధవారం కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, కౌన్సిల్ కో ఆప్షన్ సభ్యుడు రెడ్డి రాధాకృష్ణ, కౌన్సిలర్లు హాజరయ్యారు. 14 అంశాలతో కూడిన అజెండా వివరాలను కమిషనర్ టీవీ రంగారావు చదివి వినిపించగా అంశాల వారీగా చైర్‌పర్సన్ దుర్గారాణి సమావేశాన్ని నడిపించారు.

విలీన అంశంపై ఏకగ్రీవ తీర్మానం

మండపేట పట్టణాన్ని తూర్పు గోదావరి జిల్లాలో విలీనం చేయాలంటూ 9వ అజెండా అంశంగా జరిపిన చర్చలో కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. రాష్ట్రంలోని జిల్లాలు, మండలాలు, గ్రామాల సరిహద్దులు పేర్లు మార్పులు చేర్పులు కోసం అధ్యయనం చేసేందుకు ప్రభుత్వం మంత్రి వర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసింది. విలీనానికి సానుకూలమన్న విషయాన్ని మంత్రివర్గ ఉపసంఘానికి తెలిజేయున్నట్టు ఎమ్మెల్యే వేగుళ్ల వివరించారు.



సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే, కౌన్సిలర్లు

సోలార్ విద్యుత్‌పై దృష్టి

పట్టణంలో సోలార్ విద్యుత్ వినియోగాన్ని పెంచేందుకు దృష్టి పెట్టాలని కౌన్సిల్ సభ్యులు, అధికారులు నిర్ణయించారు. కమిషనర్ రంగారావు మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాలు, స్కూళ్లు, పార్కులు, ఖాళీ స్థలాల్లో సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామన్నారు. కో ఆప్షన్ సభ్యులు రెడ్డి రాధాకష్ణ మాట్లాడుతూ ఈ సోలార్ విద్యుత్ వాడకం ప్రయోజనకరమని తాను వినియోగిస్తున్నానని చెప్పారు.

ఎస్సీ, ఎస్టీలకు ఉచిత విద్యుత్‌లో జాప్యం

ఎమ్మెల్యే వేగుళ్ల మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల విద్యుత్‌ను ఉచితంగా ప్రభుత్వం ఇస్తోందన్నారు. 8వ వార్డు కౌన్సిలర్ మందపల్లి రవికుమార్ మాట్లాడుతూ మూడు నెలలు క్రితం ఇంటింటికీ తిరిగి ఉచిత విద్యుత్ లబ్ధిదారుల జాబితా తయారు చేసినప్పటికీ పథకం అమలు కావడం లేదన్నారు. దీనిపై ఎమ్మెల్యే ట్రాన్స్‌ కో అధికారులతో ఫోన్‌లో చర్చించారు. ఆగస్టు 6న కోనసీమ జిల్లా వ్యాప్తంగా టెండర్లు పిలిచే ప్రక్రియ జరగనుందని ఎమ్మెల్యే వేగుళ్లకు అధికారులు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ దుర్గారాణి

ఆక్రమణలపై చర్చ

పట్టణంలో ఆక్రమణల సమస్య చర్చకు వచ్చింది. చైర్‌పర్సన్ దుర్గారాణి మాట్లాడుతూ, ఆక్రమణ జరిగిన వెంటనే అధికారులు స్పందిస్తే సమస్య వెంటనే పరిష్కారమవుతుందన్నారు. జాప్యం చేయడం వల్ల సమస్య మరింత జఠిలం అవుతుందన్నారు. గొల్లపుంత రోడ్డులో కడుతున్న భారీ షాపింగ్ కాంప్లెక్స్‌లకు అనుమతులు ఉన్నాయా ? అని కౌన్సిలర్ గంగరాజు ప్రశ్నించారు. దీనిపై టీపీఓ రమ్య మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు సాగినట్టు గుర్తించామని, పీవో నోటీసులు సైతం జారీ చేశామన్నారు. అక్రమ నిర్మాణాలను పడగొట్టడం గాని, కోర్టుకు సమర్పించడం గానీ చేస్తామని కమిషనర్ తెలిపారు.

లైన్ దాటితే..

కేపీ రోడ్డులో గీచిన సరిహద్దు లైన్ దాటి వాహనాలను నిలిపితే ట్రాఫిక్ సమస్య ఎదురవుతోంది. కాగా ఈ సమస్య పరిష్కారంపై చర్చ జరిగింది. పోలీసులు జరిమానాలను విధిస్తే రాజకీయ నాయకులకు ఫోన్లు వస్తాయని పలువురు కౌన్సిలర్లు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. సరిహద్దు లైన్ అతిక్రమించి నిలిపిన వాహనాల గాలి తీసేయమని పోలీసులకు చెప్పేందుకు కౌన్సిల్ ప్రజాప్రతినిధులు నిర్ణయించారు. నాళం వారి వీధి, గోల్డ్ మార్కెట్ వీధి, పోలీస్ స్టేషన్ వీధుల్లోని ట్రాఫిక్ సమస్యలపై అధికారులు తగిన చర్యలు చేపట్టాలంటూ చైర్‌పర్సన్ దుర్గారాణి, కో ఆప్షన్ సభ్యుడు రాధాకృష్ణ కోరారు. బీసీల అభ్యున్నతికి కృషి చేసిన దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహాన్ని మండపేట పట్టణంలో ఏర్పాటు చేసుకునేందుకు అనుమతి ఇవ్వాలని వైస్ చైర్మన్ పిల్లి గణేశ్వరరావు కోరారు.